11-07-2023 ప్రాత:మురళి ఓంశాంతి ''బాప్ దాదా'' మధువనం

"మధురమైన పిల్లలూ - అంతర్ముఖులుగా అయి చదువులో తత్పరులై ఉండండి, శ్రీమతముపై సదా నడుస్తూ ఉండండి, అప్పుడు మీ భాగ్యము ఎంతో ఉన్నతముగా తయారవుతుంది, ఇది మీ భాగ్యాన్ని తయారుచేసుకునే సమయము"

ప్రశ్న:- పిల్లలైన మీ యొక్క ఏ ఉన్నతమైన భాగ్యము ఆధారముగా మీరు మొత్తం సృష్టి అంతటి భాగ్యాన్ని తెలుసుకుంటారు?

జవాబు:- స్వదర్శన చక్రధారులుగా అవ్వడము - ఇది అన్నింటికన్నా ఉన్నతోన్నతమైన భాగ్యము. బ్రాహ్మణులైన మీరు ఇప్పుడు స్వదర్శన చక్రధారులుగా అయ్యారు. మీకు మీ భాగ్యము గురించి కూడా తెలుసు, అలాగే మొత్తం సృష్టి అంతటి భాగ్యము గురించి కూడా తెలుసు. బాబా పిల్లలైన మీ భాగ్యాన్ని వజ్రతుల్యముగా తయారుచేయడానికి వచ్చారు. స్వయంగా భగవంతుడు మా భాగ్యాన్ని తయారుచేయడానికి చదివిస్తున్నారు అన్నది స్మృతిలో ఉండాలి, అప్పుడు భాగ్యము తయారవుతూ ఉంటుంది.

పాట:- రానున్న రేపటికి నీవు... (ఆనే వాలీ కల్ కీ తుమ్...)

ఓం శాంతి. పిల్లలు పాటలోని రెండు పదాలను విన్నారు. వినడంతోనే తమ భాగ్యపు నషా పైకి ఎక్కాలి. ఇది అవినాశీ నషా, ఇది కిందకు దిగకూడదు. ఎవరైనా మనుష్యులు షావుకార్లుగా, పదమపతులుగా ఉన్నట్లయితే వారికి రాత్రింబవళ్ళూ నషా ఉంటుంది - మేము చాలా ధనవంతులము, ఆస్తిపరులము అని. సంపద యొక్క నషానే ఎక్కుతుంది. తండ్రి భాగ్యాన్ని తయారుచేసేవారు. ప్రస్తుతం భాగ్యం పాడైపోయి ఉంది. గవ్వ సమానమైన భాగ్యము ఉందా లేక వజ్ర సమానమైన భాగ్యము ఉందా, ఇది మీరే జడ్జ్ చేయగలరు. అనంతమైన తండ్రి సమ్ముఖముగా కూర్చొని భాగ్యాన్ని తయారుచేస్తారు. అది మీరు చూస్తారు, తెలుసుకుంటారు. పరమపిత పరమాత్మను చూస్తారా లేక తెలుసుకుంటారా? మేము ఒక ఆత్మ - అని పిల్లలకు తెలుసు. ఆత్మను చూడకపోయినా సరే - మేము ఒక ఆత్మ అని, ఒక నక్షత్రము వలె ఉన్నామని, భృకుటి మధ్యలో ఉంటామని నిశ్చయము ఉంది. ఈ సమయంలో పిల్లలైన మీరు ఆత్మాభిమానులుగా అవ్వాలి. ఈ దేహములో ఉండేవారిని దేహీ ఆత్మ అని అంటారు. మమ్మల్ని పరమపిత పరమాత్మ వచ్చి కలిసారు అని ఆత్మకు అభిమానము ఉంది. పిల్లలు తండ్రి వద్ద జన్మ తీసుకుంటారు కావున వారు వారసులు అవుతారు. అయితే కొందరు పైస అంత విలువ చేసే భాగ్యాన్ని పొందుతారు, కొందరు ఏమీ పొందరు. కేవలం జన్మ మాత్రమే పొందుతారు. కొందరికి 5-6 మంది పిల్లలు ఉంటారు. చిన్న ఉద్యోగం లభిస్తే, నా భాగ్యములో ఇంతే ఉంది అని భావిస్తారు. ఇతరులను చూసి - వారి భాగ్యములో ఎన్ని మహళ్ళు, కిరీటాలు, సింహాసనాలు మొదలైనవి ఉన్నాయి అని అనుకుంటారు. మనుష్యుల భాగ్యములో వెరైటీలు ఉన్నాయి కదా. కావున ఇప్పుడు మీకు మీ భాగ్యము గురించి తెలుసు. ఏ భాగ్యము కొరకు పురుషార్థము చేస్తున్నారో తెలుసు. ధనము కొరకు, సుఖము కొరకు మనుష్యులు పురుషార్థమైతే చేస్తారు. ధనవంతులైన మనుష్యులు రోగగ్రస్థులుగా అయితే మంచి-మంచి డాక్టర్ల వద్ద చికిత్స తీసుకుంటారు. ధనము ద్వారా మంచి చికిత్స లభిస్తుందని భావిస్తారు. కావున ఇది ధనము యొక్క విషయము కదా. మీరు శ్రీమతము ద్వారా చాలా అద్భుతమైన భాగ్యాన్ని తయారుచేసుకుంటారు. బాబా ఉన్నతోన్నతమైన భాగ్యాన్ని తయారుచేస్తారని పిల్లలకు తెలుసు ఎందుకంటే వారు స్వయం ఉన్నతోన్నతమైనవారు. ఇప్పుడు మీరు వారి సమ్ముఖములో కూర్చున్నారు కదా. మాత, పితల ఇంట్లో కూర్చున్నారు. ఎవరైనా రాజు-రాణి ఉంటే, వారు - మేము అటువంటి కర్మలు చేసాము కావున మాకు రాజ్య భాగ్యము లభించింది అని భావిస్తారు. మనము ఈ లక్ష్మీ-నారాయణుల చిత్రమునేదైతే చూస్తున్నామో, వారు కూడా తప్పకుండా తమ ముందు జన్మలో భాగ్యాన్ని తయారుచేసుకున్నారు అని మీకు తెలుసు. మీకు ఈ బుద్ధి లభించింది. మనుష్యుల బుద్ధిలోకి ఈ విషయాలు రావు. ఇంత ధనవంతులైన మనుష్యులు ఉన్నారు, కానీ వారికి ఆ భాగ్యము ఎలా లభించింది? గత జన్మలో అటువంటి కర్మలు చేసారు కావుననే అంత ధనవంతులుగా అయ్యారు అని అంటారు. ఇది కర్మల ఫలము కదా. కర్మల గతి అతీతమైనది అని అంటూ ఉంటారు కూడా. మనుష్యులు గత కర్మల అనుసారంగానే అనుభవిస్తారు. ఇప్పుడు మీరు అందరికన్నా పెద్దవారైన లక్ష్మీ-నారాయణుల భాగ్యాన్ని పోలుస్తారు. వారు సత్యయుగానికి యజమానులుగా అయ్యారు, వారి కర్మల గతిని ఈ విధంగా ఎవరు తయారుచేసిన కారణముగా వారు విశ్వానికి యజమానులుగా

అయ్యారు? మీరు మొత్తం చక్రమంతటినీ తెలుసుకున్నారు.

బ్రాహ్మణులైన మీరు ఇప్పుడు స్వదర్శన చక్రధారులుగా అయ్యారు. వేరే బ్రాహ్మణులు స్వదర్శన చక్రధారులుగా ఉండరు. వారు కూడా బ్రాహ్మణులే, మీరు కూడా బ్రాహ్మణులే. కానీ మనం సత్యమైన బ్రాహ్మణులమని మీకు తెలుసు. మనం బ్రహ్మ ముఖవంశావళి. తప్పకుండా బ్రహ్మ కూడా ఎవరికో సంతానమై ఉంటారు. వారు శివబాబా సంతానము. శివబాబా రచయిత, వారికి తండ్రి ఎవరూ ఉండరు. కావున ఇప్పుడు మీ భాగ్యాన్ని పరమపిత పరమాత్మ తయారుచేస్తారు. తండ్రి ద్వారానే భాగ్యము తయారవుతుంది. పెదనాన్నలు, చిన్నాన్నలు, మామయ్యలు మొదలైనవారి ద్వారా తయారవ్వదు. కొందరిది తయారవ్వవచ్చు, వారు దత్తత తీసుకుంటే తయారవుతుంది. పిల్లలైన మిమ్మల్ని కూడా డ్రామా అనుసారంగా కల్పపూర్వము వలె దత్తత తీసుకున్నారు. వారికన్నా ఉన్నతమైనవారు ఇంకెవ్వరూ లేరు. ప్రజాపిత బ్రహ్మకు ఎంతమంది పిల్లలు ఉన్నారు, లెక్కలేనంతమంది ఉన్నారు. వారికి తండ్రి నుండి ఏమి వారసత్వము లభిస్తూ ఉండవచ్చు. శివబాబా ఆత్మలందరికీ తండ్రి మరియు బ్రహ్మ జీవాత్మలందరికీ తండ్రి అని మీరు అర్థం చేసుకున్నారు. ఈ సంబంధంతో మీరు సోదరీ-సోదరులుగా అవుతారు. తండ్రి పిల్లలైన మీతో అంటారు - మీ భాగ్యము ఎంత ఉన్నతమైనదో చూసారా! నేను మిమ్మల్ని చదివించి ఎంత భాగ్యవంతులుగా తయారుచేస్తాను. తప్పకుండా సత్యయుగ ఆదిలో శ్రీ లక్ష్మీ-నారాయణులు మరియు ఈ స్వర్గవాసుల రాజధాని ఉండేది. వారి భాగ్యాన్ని ఎంత ఉన్నతముగా తయారుచేసాను. శివబాబాయే వారి ఉన్నతమైన భాగ్యాన్ని తయారుచేసారు అన్న రహస్యం పిల్లలైన మీ బుద్ధిలో ఉంది. వారు భాగ్యాన్ని అనుభవించి 84 జన్మలు పూర్తి చేసారు. ఇప్పుడు మళ్ళీ అదే భాగ్యాన్ని తయారుచేసుకుంటున్నారు. పిల్లలైన మీ బుద్ధిలో ఈ జ్ఞానం ఉంది. జ్ఞానసాగరుడైన శివబాబా తప్ప ఇంకెవ్వరూ అర్థం చేయించలేరు. ఇటువంటి తండ్రి ఎంత ప్రియమైనవారు. మీరు కూడా ప్రియమైన పిల్లలు అని తండ్రి కూడా అంటారు. మిమ్మల్ని నేను ఆజ్ఞాపిస్తున్నాను - నిరంతరమూ నన్ను స్మృతి చేసే అభ్యాసము చేయండి, అప్పుడు మీ వికర్మలు వినాశనమవుతాయి. శివబాబా ఇప్పుడు ఈ బ్రహ్మ తనువులో సమ్ముఖముగా ఉన్నారని మీకు తెలుసు. తండ్రి అర్థం చేయించారు, నేను ఎల్లప్పుడూ నిరాకారుడినే. నా పేరు ఎల్లప్పుడూ శివయే. నేను సాకారములోకి వచ్చి పునర్జన్మలు తీసుకోను. ఇప్పుడు నేను వచ్చాను. ఎవరు మాట్లాడుతున్నారు అన్నది మీకు తెలుసు! మీ బుద్ధి పైకి వెళ్ళిపోతుంది. ఆ నిరాకార పరమపిత పరమాత్మ జ్ఞానసాగరుడు. వారే భాగ్యాన్ని తయారుచేసేవారు. స్వర్గ స్థాపకుడైన తండ్రి స్వర్గాన్ని స్థాపన చేస్తారు కదా. తండ్రి ఏ విధముగా బ్రహ్మ తనువులో సమ్ముఖముగా మాట్లాడుతున్నారు అనేది మీకు తెలుసు. వారు అంటారు - ప్రియమైన పిల్లలూ, ఇప్పుడు డ్రామా పూర్తయ్యింది. ఆత్మ వింటుంది. ఇది యథార్థమైన విషయమని ఆత్మకే తెలుసు. తండ్రి అంటారు, ఎంత వీలైతే అంత నన్ను స్మృతి చేయండి. మొత్తం సృష్టి చక్రమంతటి జ్ఞానాన్ని మీకే ఇచ్చాను. కొందరికి బాగా ధారణ అవుతుంది, కొందరు మర్చిపోతారు. ఇప్పుడు మీరు కూర్చున్నారు, మీకు ఈ జ్ఞానామృతాన్ని ఇస్తున్నారు లేక ఈ జ్ఞానాన్ని చదివిస్తున్నారు. శివబాబా సమ్ముఖముగా కూర్చున్నారు. వారు జనన-మరణాలలోకి రారు. మీకు జన్మ-జన్మలూ నామ, రూప, దేశ, కాలాలు మారుతూ ఉంటాయి. రూపు-రేఖలు ఎప్పుడూ వేరు-వేరుగా లభిస్తాయి. ఇవి ఎంత గుహ్యమైన, సూక్ష్మమైన విషయాలు. మీ ఆత్మ పదే-పదే ఒక శరీరాన్ని వదిలి ఇంకొక శరీరం తీసుకుంటుంది. ఈ సమయంలో మీ రూపము ఏదైతే ఉందో అది మరుసటి జన్మలో ఉండదు. ఒకదానితో మరొకటి కలవదు. ఆత్మ ఒక శరీరాన్ని వదిలి ఇంకొకటి తీసుకున్నప్పుడు తన కర్మలు, ఆలోచనలు మొదలైనవన్నీ మారిపోతాయి. ఆత్మ ఎన్ని భిన్న-భిన్న పాత్రలను అభినయించవలసి ఉంటుంది. భిన్న నామ, రూప, దేశ, కాలాలతో, కర్మలతో పాత్రను అభినయిస్తుంది. పాత్రలు కూడా మారుతూ ఉంటాయి. ఒకసారి రాజుగా, ఒకసారి నిరుపేదగా అవుతారు. అంతేకానీ ఒక్కోసారి కుక్క, పిల్లిగా కూడా అవుతారని కాదు. మేము భవిష్యత్తులో యువరాజులుగా, యువరాణులుగా అయ్యేందుకు పురుషార్థము చేస్తాము అని ఇప్పుడు మీకు తెలుసు. మనుష్యుల నుండి దేవతలుగా అవుతున్నారు. ఈ మమ్మా, బాబా కూడా పురుషార్థము చేస్తున్నారు. తర్వాత భవిష్యత్తులో వెళ్ళి లక్ష్మీ-నారాయణులుగా అవుతారు. మనం కూడా ఎంతగా మన భాగ్యాన్ని తయారుచేసుకునేందుకు పురుషార్థము చేస్తామో, అంతగా చాలా సుఖము లభిస్తుంది. ఇది ఎంత అద్భుతమైన సంపాదన. వారు మహా అయితే అల్పకాలికమైన సుఖము కొరకు చదువుకుని ఇదే జన్మలో బ్యారిస్టర్ మొదలైనవారిగా అవుతారు. అక్కడ మరుసటి జన్మకు సంబంధించి ఏమీ ఉండదు. మరుసటి జన్మలో అలా అవ్వచ్చు, అవ్వకపోవచ్చు కూడా. మీరైతే - మేము భవిష్యత్తులో స్వర్గములోకి తప్పకుండా వెళ్తాము అని భావిస్తారు. అక్కడ దేవీ-దేవతలుగా పిలువబడతారు. తండ్రి ద్వారా మేము సింహాసనాధికారపు వారసత్వాన్ని తీసుకొని తీరుతాము, ఉన్నతోన్నతముగా తయారై చూపిస్తాము - అన్నది ఎప్పుడూ మర్చిపోకూడదు. గాడ్ ఫాదర్ చదివిస్తున్నారు, ఇది కూడా బుద్ధిలోకి వస్తుంది. మనం బాగా చదువుకొని 21 జన్మల కొరకు మన ప్రారబ్ధాన్ని తయారుచేసుకుంటాము. ఈ సమయంలో ఎంతగా పురుషార్థము

చేస్తామో అంతగా ఉన్నతమైన భాగ్యాన్ని తయారుచేసుకుంటాము. ఆ భాగ్యము కల్ప-కల్పాంతరాలూ స్థిరముగా ఉంటుంది, అందుకే ఈ సమయంలో భాగ్యము కొరకు మంచి పురుషార్థము చేయాలి. ఇది చాలా గొప్ప భాగ్యము. ఇందులో చాలా సుఖము ఉంది. ఇక్కడ కొందరి వద్ద కోట్లు ఉన్నా కానీ పైసకు విలువ చేసే సుఖము కూడా లేదు. అక్కడైతే పూర్తిగా శాంతిగా, ప్రశాంతంగా ప్రారబ్ధాన్ని అనుభవిస్తారు. ఇక్కడ ఎన్ని ఆపదలు వస్తూ ఉంటాయి. కొద్ది సమయంలోనే పూర్తిగా దివాలా తీస్తారు, మరణిస్తూ ఉంటారు. ఇన్స్యూర్ చేసుకున్నా కానీ ఆ ఇన్స్యూరెన్స్ కంపెనీ కూడా ఏమి చేయగలదు? హిరోషిమాలో ఎటువంటి పరిస్థితి ఏర్పడింది! ఎంతమంది వ్యక్తులు మరణించారు! ఇన్స్యూరెన్స్ కంపెనీ కూడా దివాలా తీసింది. ఇక్కడ కూడా అలాగే జరుగుతుంది. అందరూ అంతమైపోతారు. ఇన్సూరెన్స్ వారు డబ్బును ఎవరికి ఇస్తారు? ఇతరుల దీపాన్ని ఎవరు వెలిగిస్తారు?

మనుష్యులలో అంధ విశ్వాసము ఎంత ఉంది! గొప్ప వ్యక్తుల షో చేస్తారు. ఋషులు, మునులను వారికన్నా గొప్పవారిగా భావిస్తారు. ధర్మాలను అంగీకరించకపోయినా కానీ సన్యాసులకు తప్పకుండా నమస్కరిస్తూ ఉంటారు. సాధువుల ముందుకు వెళ్ళి సాష్టాంగ ప్రణామము చేస్తారు. కానీ సాధువులు వారి ముందు అలా చేయరు ఎందుకంటే - మేము ఉన్నతులము, పవిత్రులము అని భావిస్తారు. తండ్రి అంటారు, నా ప్రియమైన పిల్లలూ, నేను పిల్లలకు నమస్కారం చేస్తాను. మీరు నా శిరస్సుపై నెమలి పింఛము వంటివారు. మీరు విశ్వాధిపతులుగా అవుతారు. మీరు బ్రహ్మాండానికి కూడా అధిపతులు. మీరు డబుల్ అధిపతులు. నేను కేవలం సింగిల్ అధిపతిని మాత్రమే, బ్రహ్మాండానికే అధిపతిగా అవుతాను. ఇటువంటి విషయాలు తండ్రి తప్ప ఇంకెవ్వరూ అర్థం చేయించలేరు. మరి ఇటువంటి తండ్రిని, ఎవరి నుండైతే ఇటువంటి వారసత్వం లభిస్తుందో, వారిని ఎంతగా స్మృతి చేయాలి. తండ్రి అంటారు, చూడండి, ఎంతమంది పిల్లలు ఇక్కడకు వచ్చి వెళ్తూ ఉంటారు. ఆ తర్వాత ఆరు మాసాల వరకు కూడా తండ్రికి ఉత్తరం వ్రాయరు. అరే, ప్రాణాన్ని ఇచ్చే, ప్రాణాలకన్నా ప్రియమైన తండ్రికి ఉత్తరం వ్రాయరా. పతి-పత్ని ఒకరికొకరు ఉత్తరాలు వ్రాసుకొనేటప్పుడు - ప్రాణేశ్వరా, ఫలానా, ఫలానా... అని రాస్తారు. వాస్తవానికి అతను ప్రాణేశ్వరుడేమీ కాదు. ప్రాణేశ్వరుడు ఒక్క తండ్రి మాత్రమే. అందరి ప్రాణులకు ఈశ్వరుడు, ఆ తండ్రి ఒక్కరే. వారు, ప్రాణేశ్వరులైన పిల్లలూ అని అంటారు, అనగా ప్రాణాలను రక్షించే ఈశ్వరుని పిల్లలు. పిల్లలు కూడా - ప్రాణేశ్వరుడైన బాబా, నా ప్రాణాలను రక్షించే బాబా అని అంటారు. ఇక్కడి నుండే ఈ పేరు వెలువడింది. భారత్ లోనే ఈ విధంగా ప్రాణేశ్వరా, ప్రాణేశ్వరీ అని రాసుకుంటారు కానీ వారు అలా లేరు. ప్రాణాలను తండ్రియే దానం చేస్తారు. తండ్రి అంటారు, మీరు నావారిగా అవుతారు, కావున మీకు ఎవ్వరూ దుఃఖాన్ని ఇవ్వలేరు. ఆత్మకే దుఃఖము లభిస్తుంది. తండ్రి ఎంత ప్రేమగా అర్థం చేయిస్తారు అని ఆత్మయే అనుభవం చేస్తుంది. స్మృతి కూడా వారినే చేస్తుంది, మహిమ చేస్తుంది. మమ్మాను కూడా ఎంతగా తలచుకుంటారు. ఎవరైతే అనేకులకు మంచి సేవను చేస్తారో, వారికి ఎంత ఉన్నత పదవి లభిస్తుంది. ఆ తర్వాత ఎవరైతే రెండవ నంబరులో సేవలో బాబాను ఫాలో చేస్తారో, వారు తర్వాత ఉంటారు. మీరు చాలా దయార్ద్ర హృదయులుగా అవ్వాలి. ఏ విధముగా బాబా మనల్ని తయారుచేసారో, అలా మనం ఇతరులను తయారుచేయాలి. స్వర్గ రాజధాని అనేది ఎంత పెద్ద ఆస్తి యొక్క ప్రాప్తి! అక్కడ మనం ఎంత షావుకార్లుగా ఉంటామంటే బంగారము, వజ్రాలతో మహళ్ళను తయారుచేస్తాము. మాయా మశ్చిందర్ ఆటను కూడా ఒకటి చూపిస్తారు. అతను బంగారు ఇటుకలు పడి ఉన్నట్లుగా చూస్తారు, కొన్ని తీసుకువెళ్ళాలని అనుకుంటారు. మీరు సాక్షాత్కారములో స్వర్గములో వజ్ర-వైఢూర్యాల మహళ్ళను చూస్తారు. బంగారు గనులను చూసినప్పుడు కొంత తీసుకువెళ్ళాలని అనుకుంటారు. సూక్ష్మవతనములో బంగారము లభించదు. బంగారము వైకుంఠములో ఉంటుంది. అక్కడ మనం విమానాలలో వెళ్ళి గనుల నుండి బంగారాన్ని నింపుకొని తీసుకువస్తామని మీకు తెలుసు. పెద్ద-పెద్ద బంగారు ఇటుకలు కూడా ఉంటాయి. ఇప్పుడు కూడా గొప్ప-గొప్ప వారి వద్ద బంగారము నిల్వ ఉంది కదా. భారత్ బంగారము, వెండిని తప్పకుండా ఉంచుకోవాలి. అందరి వద్దా పెద్ద-పెద్ద గుహలు తయారుచేయబడి ఉన్నాయి. అక్కడి నుండి ఎవరూ దోచుకోలేని విధంగా, అగ్నితో తగులబెట్టలేని విధంగా ఉన్నాయి. అవన్నీ భవిష్యత్తులో మీ చేతిలోకి వస్తాయి. ఏ విమానాలు మొదలైనవాటి ద్వారా ఇప్పుడు వినాశనం కొరకు బాంబులు మొదలైనవి వేస్తారో, అవే వస్తువులు మళ్ళీ సుఖము కొరకు నిమిత్తమవుతాయి. సత్యయుగములో ఇవన్నీ ఉండేవి, తర్వాత కనుమరుగైపోయాయి. ఇప్పుడు మళ్ళీ తయారయ్యాయి. గనులలోకి ఏ విధముగా వెళ్ళి తీసుకువస్తారు అనేది మీకు తెలుసు. గనులన్నీ కొత్తవైపోతాయి. ఇప్పుడు పాతగా ఉన్నాయి. కావున ఇటువంటి భాగ్యాన్ని తయారుచేసే తండ్రి నుండి పూర్తి భాగ్యాన్ని తీసుకోవాలి. ఇందులో నిర్లక్ష్యం చేయకూడదు. తండ్రిని మరియు వారసత్వాన్ని స్మృతి చేయండి. తండ్రి అంటారు, ఒక్కరి పట్లే మోహమును పెట్టుకోండి, స్వర్గాన్ని స్మృతి చేయండి. అచ్చా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. మీ ఉన్నతమైన భాగ్యాన్ని తయారుచేసుకోవడంలో నిర్లక్ష్యం చేయకూడదు. శ్రీమతముపై బాగా నడుస్తూ చదువు ఆధారముగా ఉన్నతమైన భాగ్యాన్ని తయారుచేసుకోవాలి.

2. ప్రాణేశ్వరుడైన తండ్రి స్మృతిలో ఉంటూ అందరికీ ప్రాణదానాన్ని ఇవ్వాలి. అందరి ప్రాణాలను రక్షించాలి. ఎవరినీ దుఃఖితులుగా చేయకూడదు.

వరదానము:- యజమాని స్థితిలో ఉంటూ ప్రకృతి ద్వారా సహయోగపు మాలను ధరించే ప్రకృతీజీత్ భవ

ప్రకృతి యజమానులైన మిమ్మల్ని ఇప్పుడు ఆహ్వానిస్తూ ఉంది. నలువైపులా ప్రకృతి తత్వాలు అలజడి చేస్తాయి, కానీ ఎక్కడైతే ప్రకృతికి యజమానులైన మీరు ఉంటారో, అక్కడ ప్రకృతి దాసిగా అయ్యి సేవ చేస్తుంది. మీరు కేవలము ప్రకృతీజీతులుగా అవ్వండి, అప్పుడు ప్రకృతి సహయోగమనే మాలను ధరింపజేస్తుంది. ఎక్కడైతే ప్రకృతీజీతులైన బ్రాహ్మణులైన మీ పాదము ఉంటుందో, స్థానము ఉంటుందో, అక్కడ ఎటువంటి నష్టము జరుగదు. తుఫానులు వస్తాయి, భూమి కంపిస్తుంది, కానీ బయట శూలములాంటి పరిస్థితి ఉంటుంది మరియు ఇక్కడ చిన్న ముల్లులా ఉంటుంది. అందరూ మీ వద్దకు స్థూల, సూక్ష్మ ఆసరా కొరకు పరుగుతీస్తారు.

స్లోగన్:- అలౌకిక సుఖమును మరియు మనోరసమును అనుభవము చేయాలంటే మన్మనాభవ స్థితిలో ఉండండి.